ప్రజాశక్తి

బుధవారం 7 జూన్ 2023



రేపు అరసవల్లి హుండీ లెక్కింపు



ప్రజాశక్తి - శ్రీకాకుళం

అరసవల్లిలోని సూర్యనారాయణ స్వామి ఆలయ హుండీలను ఈనెల ఎనిమిదో తేదీన లెక్కించనున్నట్లు దేవాదాయ శాఖ సహాయ కమిషనర్, ఆలయ కార్యనిర్వహణాధికారి వి.హరి సూర్యప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం ఎనిమిది గంటలకు అనువంశిక ధర్మకర్త, అర్చకులు, యాత్రికులు, గ్రామ పెద్దల సమక్షంలో హుండీలను తెరవనున్నట్లు పేర్కొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల్లో అవకతవకలు!

- రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఉల్లంఘన
- ఎస్‌టిలకు కేటాయించిన పోస్టుల్లో ఇతరులు


అంగన్‌వాడీ పోస్టుల భర్తీలో పాత కథే పునరావృతమైంది. అంగన్‌వాడీ పోస్టుల భర్తీలో అవకతవకలు జరిగాయనే గతంలో నోటిఫికేషన్ రద్దు చేసి కొత్తగా ప్రకటన ఇచ్చారు. తాజాగా భర్తీ చేసిన పోస్టుల్లోనూ అవకతవకలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకుండా అడ్డగోలుగా నియమకాలు చేపట్టారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్నిచోట్ల ఎస్‌సి, ఎస్‌టిలకు కేటాయించిన పోస్టుల్లో ఇతర అభ్యర్థులకు అవకాశం కల్పించారు. ఎస్‌టిలకు అవకాశం కల్పించిన చోట రాజకీయ సిఫార్సులతో బిసిలకు కేటాయించారు. అంగన్‌వాడీ పోస్టుల భర్తీలో అవకతవకలు జరిగాయనే గతంలో నోటిఫికేషన్ రద్దు చేసి కొత్తగా ప్రకటన ఇచ్చారు. తమకు అన్యాయం జరిగిందంటూ అర్హులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

అంగన్‌వాడీ పోస్టుల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయనడానికి అనేక దృష్టాంతాలు ఉన్నాయి. ఐసిడిఎస్ మందస ప్రాజెక్టు పరిధిలో మొత్తం ఎనిమిది పోస్టులకు గత నెల 12వ తేదీన అధికారులు నోటిఫికేషన్ ఇచ్చారు. ఇందులో అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులు రెండు, ఆయా పోస్టులు ఆరు ఉన్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు. మందస ప్రాజెక్టు పరిధిలోని సోంపేట మండలం మాకన్నపురం ఒకటో సెంటర్ పోస్టును ఎస్‌టికి రిజర్వు చేశారు. ఈ పోస్టుకు మాకన్నపురం నుంచి ఎస్‌టికి చెందిన సిహెచ్.జ్యోతి దరఖాస్తు చేసుకున్నారు. పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు ప్రకటనలో పేర్కొన్న అన్ని అర్హతలు ఉండడంతో ఈమెను గత నెల 24వ తేదీన పలాసలో ఇంటర్వ్యూకు పిలిచారు. పోస్టుకు ఈమె మాత్రమే దరఖాస్తు చేయడం, అర్హతలు ఉండడంతో పోస్టు తనకు మాత్రమే దక్కుతుందని ఆశించారు. అధికారులు మాత్రం వేరే వారికి కట్టబెడుతున్నారని ఆమె చెప్తున్నారు. అదే కేంద్రంలో ఆయాగా పనిచేస్తున్న బిసికి చెందిన కె.స్వప్న తాను పదో తరగతి పాసయ్యాని, ఉద్యోగోన్నతి కల్పించి మాకన్నపురం అంగన్‌వాడీ కార్యకర్తగా అవకాశం కల్పించాలంటూ ఐసిడిఎస్ అధికారులకు తన దరఖాస్తు అందించినట్లు తెలుస్తోంది. కార్యకర్త పోస్టును స్వప్నకు ఇస్తామని, ఆయా పోస్టును నీకు ఇస్తామంటూ ఐసిడిఎస్ అధికారులు రాజీమార్గం అనుసరిస్తున్నట్లు తెలుస్తోంది. కనీసం దరఖాస్తు చేయకుండా, ఇంటర్వ్యూకూ హాజరు కాకుండా ఎలా ఇస్తారంటూ అభ్యర్థి జ్యోతి కుటుంబసభ్యులు ప్రశ్నిస్తున్నారు. రాజకీయ ఒత్తిళ్లతో ఆమెకు కార్యకర్త పోస్టును కట్టబెట్టేందుకు సిద్ధమవుతున్నారంటూ వారు ఆరోపిస్తున్నారు.

చింతలబడవంజలోనూ అదే కథ

ఎల్ఎన్‌పేట మండలం చింతలబడవంజ గ్రామంలోనూ ఇదే రకమైన రోస్టర్‌ను మార్చినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇక్కడ ఒకటో సెంటర్‌లో కార్యకర్త పోస్టును ఎస్‌టికి కేటాయించారం.



NOTIFICATION

SL No	Name of the Project	AWWs Vacancies	AWHs Vacancies	Mini AWWs Vacancies	Total Vacancies
1	ICDS Project, Mandasa	2	6	0	8

Annexure - I


SL.NO	Name Of The Project	NAME OF THE AWC	AWW	AWH	MINI AWW	TOTAL	ROSTER
1	MANDASA	MAKANNAPURAM-1	1	0	0	1	ST
2	MANDASA	ZINKIBADRA-1	[illegible]	[illegible]	[illegible]	[illegible]	OC
3	MANDASA	ISKALAPALEM II	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]

నోటిఫికేషన్‌లో పొందుపరిచిన ఎస్‌టి రోస్టర్

రాజకీయ ఒత్తిళ్లతో ఆ రోస్టర్ బిసిలకు కేటాయించారన్న విమర్శలు వస్తున్నాయి. ఎస్‌టి అభ్యర్థులు లేకపోవడం వల్లే బిసిలకు కేటాయించామని ఐసిడిఎస్ అధికారులు చెప్తున్నారు. నిబంధనల ప్రకారం పోస్టును ఎస్‌టిలకు కేటాయించిన తర్వాత ఎవరూ రాని పక్షంలో రద్దు చేస్తారు. ఇలా మూడుసార్లు ఎస్‌టిలకు కేటాయించిన తర్వాత ఎవరూ రాకపోతే అప్పుడు ఆ తర్వాత కేటగిరీ అయిన ఎస్‌సిలకు కేటాయిస్తారు. అవేవీ కాకుండా నేరుగా ఇక్కడా బిసిలకు ఇవ్వడంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

పోస్టుల భర్తీలో తీరు మారలే

అంగన్‌వాడీ పోస్టుల భర్తీలో అధికారుల తీరు మారలేదు. జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీ కోసం 2021 నుంచి పలుదఫాలుగా నోటిఫికేషన్ ఇచ్చారు. ఆ తర్వాత గతేడాది చివరిలో అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరణ, ఇంటర్వ్యూలు నిర్వహించినా కోర్టు ఉత్తర్వులతో నియామకాలను రద్దు చేశారు. ఆ తర్వాత ఈ ఏడాది ఏప్రిల్ నాలుగో తేదీన మరోసారి నోటిఫికేషన్ ఇచ్చారు. దాన్నీ రద్దు చేసి మే 11వ తేదీన నోటిఫికేషన్ జారీ చేసి ప్రస్తుతం రిక్రూట్‌మెంట్ చేస్తున్నారు. అంగన్‌వాడీ ఉద్యోగాల నోటిఫికేషన్ సందర్భంలోనే అప్పటి పీడీ కె.అనంతలక్ష్మిని కలెక్టర్ ప్రభుత్వానికి ఈ ఏడాది ఏప్రిల్ 24వ తేదీన సరెండర్ చేశారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ సరిగా పాటించలేదనేది అందులో ఒక కారణంగా ఉంది. ఇప్పుడు మళ్లీ అదే రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఉల్లంఘన జరిగినట్లుగా తెలుస్తోంది. దీనిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలని అభ్యర్థులు కోరుతున్నారు.



రోస్టర్ పత్రాన్ని చూపిస్తున్న జ్యోతి

ఎవరికీ పోస్టింగ్‌లు ఇవ్వలేదు

అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా పోస్టులకు ఇంటర్వ్యూలు మాత్రమే పూర్తయ్యాయి. ఎవరికీ పోస్టింగ్‌లు ఇవ్వలేదు. ఎస్‌టిలకు కేటాయించిన చోట అభ్యర్థులు ఎవరూ రాకపోతే ఆ స్థానంలో ఇతరులకు అవకాశం కల్పిస్తాం. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారమే చేశాం.

- జి.జయదేవి, ఐసిడిఎస్ పీడీ



ఒడిశాలోని రైలు ప్రమాద ఘటనలో మృతులను మానవత్వం లేకుండా ఒకే ట్రక్‌లో వేసి తరలించడంపై చలించిన సైకతశిల్పి గేదెల హరికృష్ణ ఆ దృశ్యాన్ని సైకత శిల్పంగా మలిచారు. దేశమంటే మట్టి కాదోయ్... దేశమంటే మనుషులోయ్ అని మండలంలోని గాజుల కొల్లివలస వద్ద ఉన్న సంగమయ్య కొండ దిగువున ఈ సైకత శిల్పాన్ని చెక్కారు.

- ప్రజాశక్తి, ఆమదాలవలస

గేటు మధ్య నిలిచిన గూడ్స్ రైలు

గంటపాటు స్తంభించిన ట్రాఫిక్

ప్రజాశక్తి - పలాస

కాశీబుగ్గ ఎల్‌సి గేటు వద్ద గూడ్స్ రైలు మంగళవారం నిలిచిపోయింది. సుమారు గంటపాటు నిలిచిపోవడంతో కిలోమీటరు పొడవునా ట్రాఫిక్ స్తంభించింది. సుమారు 50 బోగీలతో మూడు ఇంజిన్లతో ఖుర్దా రోడ్డు వైపు వెళున్న గూడ్స్ రైలు రావడంతో కాశీబుగ్గలోని ఎల్‌సి గేటును వేశారు. మంగళవారం మధ్యాహ్నం 1.45 గంటల సమయంలో కాశీబుగ్గ ఎల్‌సి గేటుకు చేరుకున్న గూడ్స్ రైలు ఎత్తు మార్గం కావడంతో ముందుకెళ్లలేక అక్కడ నిలిచిపోయింది. బోగీల బరువుకు వెనక్కి వెళ్లడంతో లోకో పైలట్ రైలును నిలుపుదల చేశారు. ఖుర్దారోడ్డు వైపు వెళ్లే మార్గంలో మండలంలోని సుమ్మాదేవి వరకు ట్రాక్ ఎత్తుగా ఉంటుంది. ఈ కారణంగా ఆ రైలు నిలిచిపోయింది. గేటు వేయడంతో పాత జాతీయ రహదారికి ఇరువైపులా వాహనాలు కిలోమీటరు పొడవునా నిలిచిపోయాయి. కొద్దిసేపటి తర్వాత లోకో పైలట్లు మొత్తం ఇంజిన్ పవర్‌ను ఉపయోగించడంతో గూడ్స్ రైలు మెల్లగా ముందుకు కదిలింది. మొత్తం గేటు దాటేందుకు సుమారు 45 నిమిషాల సమయం పట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో గ్రామదేవత ఉత్సవాలు జరుగుతున్న వేళ సాధారణ రోజుల్లో కంటే ఎక్కువ వాహనాలు రావడంతో ట్రాఫిక్ రద్దీ పెరిగింది. మండుటెండలోనే బారులు తీరిన వాహనాలు రైలు వెళ్లాక గేటు తీయడంతో ముందుకు కదిలాయి.



గూడ్స్ రైలు నిలిచిపోవడంతో స్తంభించిన ట్రాఫిక్



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం, సిపిఐ నాయకులు

రాష్ట్రానికి బిజెపి ద్రోహం

- అమిత్ షా పర్యటనకు వ్యతిరేకంగా 11న నిరసనలు
- జయప్రదం చేయాలి : సిపిఎం, సిపిఐ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రాష్ట్రానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ద్రోహం చేసిందని సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు డి.గోవిందరావు, బి.శ్రీరామ్మూర్తి విమర్శించారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకొచ్చి తొమ్మిదేళ్లు పూర్తయిన సందర్భంగా విశాఖపట్నంలో నిర్వహించే బహిరంగ సభకు హాజరవుతున్న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పర్యటనకు వ్యతిరేకంగా ఈనెల 11న నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా చేపట్టే నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నగరంలోని క్రాంతి భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 2014లో బిజెపి అధికారంలోకి వచ్చేందుకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధులు, రైల్వేజోన్, విభజన చట్టంలోని హామీల ఊసే లేకుండా పోయిందని విమర్శించారు. పోలవరం నిర్మాణం పూర్తి చేయడానికి కేంద్రం నిధులు విడుదల చేయకపోగా, రెండు లక్షలకు పైగా ఉన్న నిర్వాసితుల పునరావాసం గురించి పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. పబ్లిక్ రంగంలోని విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేసేందుకు శతవిధాలా ప్రయత్నిస్తోందని తెలిపారు. ఇందుకు వ్యతిరేకంగా విశాఖ జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తున్నా, కేంద్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేన్నారు. ప్రజాభిప్రాయాన్ని పెడచెవిన పెడుతోందని విమర్శించారు.

రాష్ట్రంలో పండగలను ఆసరా చేసుకొని మత ఉద్రిక్తతలను రెచ్చగొట్టే ప్రయత్నం బిజెపి ప్రభ్వుం చేస్తోందన్నారు. భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసిన వారిపై దాడులు, అక్రమ కేసులు పెడుతోందని విమర్శించారు. రాజ్యాంగ వ్యవస్థలను బలహీనపరిచి, రాష్ట్రాల హక్కులను హరిస్తోందన్నారు. నిత్యావసర సరుకులు, పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలను పెంచి సామాన్య ప్రజల నడ్డి విరిచిందన్నారు. ప్రజా సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతోందని ధ్వజమెత్తారు. రాష్ట్రానికి, దేశ ప్రజలకు ద్రోహం చేసిన బిజెపి ప్రభుత్వం తొమ్మిదేళ్ల ఉత్సవాలు నిర్వహించుకోవడం సిగ్గుచేటు అని అన్నారు. ఈ నేపథ్యంలో బిజెపి కేంద్ర నాయకుల పర్యటనపై ప్రజలు పలురూపాల్లో నిరసన వ్యక్తం చేయాలని కోరారు. జీడికి మద్దతు ధర కోసం ఈనెల ఎనిమిదో తేదీన నిర్వహించాల్సిన జీడి రైతుల ధర్నాను 14వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు.సమావేశంలో సిపిఐ నాయకులు కె.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



వీర కళింగం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి ధర్మాన, తదితరులు

చరిత్రను తెలుసుకునేందుకు రచనలు

- మంత్రి ధర్మాన ప్రసాదరావు
- 'వీర కళింగం' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

చరిత్రను తెలుసుకునేందుకు రచనలు, గ్రంథాలు ఎంతగానో దోహదపడతాయని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఎచ్చెర్లలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో ప్రముఖ రచయిత, చరిత్రకారులు డాక్టర్ దీర్ఘాశి విజయ భాస్కర్ రచించిన వీర కళింగం నవలను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరిత్రకు సంబంధించిన విషయాలు ఇటువంటి రచనల ద్వారా వెలుగులోకి వస్తాయని అభిప్రాయపడ్డారు. ఒక జాతిని ఐక్యం చేసేందుకు, జాతి తదుపరి భవిష్యత్ కోసం కార్యాచరణను రూపొందించుకునేందుకు ఇటువంటి చరిత్ర ఆ ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు తెలియాల్సిన అవసరముందన్నారు. వీర కళింగం రచన కాదని, ఒక పరిశోధన అని ప్రశంసించారు. కళింగ నేలకు సంబంధించి అనేక వేల సంవత్సరాల వాస్తవాలను పుస్తకం రూపంలో పొందుపరిచారని చెప్పారు. ఈ ప్రాంత విషయాలను తెలుసుకోవడం ద్వారా చైతన్యవంతులుగా మారుతామన్నారు. అన్యాయానికి గురైన, అణగారిన సమాజానికి ఏదో ఒకటి మంచి చేయాలన్న తపన ఉన్న వ్యక్తి విజయ భాస్కర్ అని ప్రశంసించారు. ఈ ప్రాంతానికి చెందిన విజయగాథ వీర కళింగం రచన గొప్ప అవార్డులు పొందేందుకు అర్హత ఉన్న పుస్తకమన్నారు. ఆవిష్కరణలో ఎపి తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ నిమ్మ వెంకటరావు, డాక్టర్ చింతాడ భాస్కరరావు, ఆచార్య వెలమల సిమ్మన్న, శివ నాగిరెడ్డి, నల్లి ధర్మారావు, అట్టాడ అప్పలనాయుడు, రాజేశ్వరి, సిహెచ్.రాజేంద్రప్రసాద్, కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, గురుగుబెల్లి లోకనాథం, అంబటి శ్రీనివాసరావు, మండవిల్లి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అతిసారపై అవగాహన కల్పించాలి

కోటబొమ్మాళి : అతిసార వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి వైద్యాధికారులకు సూచించారు. ఐదేళ్ల లోపు చిన్నారుల్లో అతిసార నివారణకు ఈనెల 17వ తేదీ వరకు నిర్వహించే అతిసార నివారణ పక్షోత్సవాల్లో భాగంగా కోటబొమ్మాళి సిహెచ్‌సిని మంగళవారం పరిశీలించారు. వార్డులో రోగులను పరిశీలించి చికిత్స అందుతున్న తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ఆరోగ్య కేంద్రాలకు, అంగన్వాడీ స్కూళ్లకు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లకు ఒఆర్ఎస్, జింక్ మాత్రలను సరఫరా చేసినట్లు తెలిపారు. ఈ పక్షోత్సవాల్లో తల్లులకు, కుటుంబ సభ్యులకు అతిసార వ్యాధిపై అవగాహన కల్పించడం, చికిత్స విధానాలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఐదేళ్ల లోపు పిల్లల్లో అతిసార లక్షణాలు కనిపిస్తే ఆశాను గానీ ఎఎన్ఎంను గానీ సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు వేగవంతం

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస

నాడు-నేడు పనులను వేగవంతం చేయాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో నాడు-నేడు పనుల ప్రగతిపై స్థానిక కళ్యాణ మండపంలో మంగళవారం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను త్వరితగతిన పూర్తి చేసి పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. పనుల్లో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సమీక్షా సమావేశానికి కొందరు ప్రధానోపాధ్యాయులు హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి గానీ, ఉన్నతాధికారుల దృష్టికి గానీ తీసుకురావాలని సూచించారు. ఫేజ్-1, ఫేజ్-2 పనులు ఎంతవరకు పూర్తయ్యాయని మండలాల వారీగా హెచ్ఎంలు, ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఎపిసి రోణంకి జయప్రకాష్, జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై అక్టోబరు 31 డెడ్‌లైన్

ఆమదాలవలస : ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి అక్టోబరు 31వ తేదీ డెడ్‌లైన్ విధిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి అలికాన రాజేశ్వరి తెలిపారు. సంఘం ఆధ్వర్యాన ఉద్యోగులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద రిలే దీక్షను మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలతో ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వస్తే వారం రోజుల్లో సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, ఆ హామీని తుంగలో తొక్కారని విమర్శించారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటే రాష్ట్ర ఖజానాకు ఇబ్బంది కలుగుతుందని చెప్తున్న పాలకులు, వారు ఎందుకు పింఛన్లను తీసుకుంటున్నారని ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులకూ సిపిఎస్ విధానం అమలు చేయాలన్నారు. ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరడం తప్పా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉద్యోగులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఉద్యమమే శరణ్యంగా భావించి దశల వారీ చేపట్టిన ఆందోళనలు అక్టోబరు 31వ తేదీ వరకు కొనసాగుతాయని చెప్పారు. అప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన రాకుంటే నిరవధిక సమ్మె చేపడతామన్నారు. కార్యక్రమంలో తాలూకా యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు డి.సురేష్, బి.నాగరాజు, ట్రెజరర్ ఎస్.హరీష్, గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూన వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిని కాపాడి మృత్యుఒడికి

- కాలువలో నీటమునుగుతున్న ఇద్దరు పిల్లలు
- ఒడ్డుకు చేర్చుతూ యువకుడు మృతి
- పొడుగుపాడులో విషాదఛాయలు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి



వెంకటరమణ మృతదేహం

వంశధార కాలువలో కొట్టుకుపోతున్న ఇద్దరు పిల్లలను ఒడ్డుకు చేర్చుతూ ఆ యువకుడు మృత్యుఒడికి చేరాడు. ఈ విషాద ఘటన మండలంలోని పొడుగుపాడులో మంగళవారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఆ గ్రామానికి చెందిన బొడ్డేపల్లి వెంకటరమణ (20) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీజగన్నాథపురం పంచాయతీ పరిధిలోని పొడుగుపాడుకు చెందిన ఇద్దరు పిల్లలు గ్రామంలోని వంశధార కాలువలో స్నానానికి దిగారు. లోతు ఉన్న ప్రాంతంలోకి దిగడంతో వారు మునిగిపోతుండడాన్ని చూసిన గ్రామానికి చెందిన మహిళ కేకలు వేసింది.

సమీపంలో ఉన్న వెంకటరమణ పరుగున వచ్చి కాలువలోకి దూకి ఇద్దరు పిల్లలను భుజాలపై కూర్చోబెట్టుకుని ఒడ్డుకు చేర్చుతుండగా నీటమునిగాడు. ఆ సమయంలోనూ భుజాలపై ఉన్న ఇద్దరు పిల్లలను ముందుకు నెట్టడంతో వారు ఒడ్డుకు సమీపంలో చేరడంతో బతికి బయటపడ్డారు. వెంకటరమణ మునిగిపోయిన విషయం గ్రామస్తులకు తెలియడంతో కాలువలో గాలించారు. అప్పటికే కొన ఊపిరితో ఉన్న వెంకటరమణను 108 సాయంతో నరసన్నపేట ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. మృతుడు టెక్కలిలోని డిగ్రీ కళాశాలలో బిఎస్‌సి చివరి సంవత్సరం చదువుతున్నాడు. చేతికి అందివచ్చిన కొడుకు కళ్లేదుటే మృతి చెందడంతో తండ్రి రామారావు, తల్లి తులసమ్మతో పాటు బంధువులు, గ్రామస్తుల రోదనలు మిన్నంటాయి. రామారావు తులసమ్మకు ఇద్దరు కుమారులు కాగా. వెంకటరమణ మొదటి సంతానం. రెండో కుమారుడు వేణు కోటబొమ్మాళిలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు.

స్టోన్ క్రషర్స్ యాజమానుల ఆందోళన

- రహదారిపై బైఠాయింపు
- రెండు గంటల పాటు నిలిచిన ట్రాఫిక్

పొందూరు : జిల్లాలో మైనింగ్ నిర్వహణ బాధ్యతను చేపట్టిన విశ్వసముద్ర సంస్థ తీరును నిరసిస్తూ మండలంలోని నరసాపురం సమీపంలో స్టోన్ క్రషర్స్ యాజమానులు పొందూరు-చిలకపాలెం రహదారిపై మంగళవారం బైఠాయించి ధర్నా చేపట్టారు. దీంతో సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ సందర్భంగా క్రషర్స్ యాజమానులు మాట్లాడుతూ సంస్థ సీనరేజ్ వసూలుకు సంబంధించి క్యూబిక్ మీటర్‌కు రూ.210 వసూలు చేయాల్సి ఉండగా, రూ.350 చొప్పున వసూలు చేస్తోందన్నారు. జిల్లా కేంద్రంలో కాకుండా టెక్కలిలో బిల్లులు ఇస్తుండడంతో వ్యయప్రయాసలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. క్రషర్‌కు వచ్చే ముడిసరుకుకూ బిల్లులు అడుగుతూ ఆ సంస్థ తమను ఇబ్బందులు పెడుతోందన్నారు. క్వారీ వాహన డ్రైవర్లపై సంస్థ సెక్యూరిటీ భౌతికదాడులు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే బిల్లులు ఇవ్వాలని, ఆ బిల్లులను జిల్లా కేంద్రంలోనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్రషర్స్‌కు వచ్చే పెద్దరాయి (ముడిసరుకు)కి అడ్డు చెప్పరాదన్నారు. దీనిపై ఆ సంస్థ డిఎం రామకృష్ణ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పినా యజమానులు ధర్నాను విరమించలేదు. ఎస్ఐ రామచంద్రరావు అక్కడికి చేరుకుని యజమానులు, విశ్వసముద్రుద సంస్థ ప్రతినిధులతో మాట్లాడారు. జిల్లా కేంద్రంలో కార్యాలయాన్ని ప్రారంభించి బిల్లులు ఇస్తామని, ఆన్‌లైన్‌లోనూ బిల్లులు తీసుకునేలా చర్యలు చేపడతామని ఆ సంస్థ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ ఫోన్‌లో విలేకరులకు చెప్పడంతో, క్రషర్స్ యాజమానులు ధర్నాను విరమించారు. ధర్నాలో క్రషర్స్ యాజమానులు వండాన వెంకటరావు, చోళ్ల శ్రీనివాసరావు, వండాన సూరపనాయుడు, అప్పలరాజు, వెంకునాయుడు, పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై బైఠాయించిన యజమానులు

మున్సిపాల్టీల్లో ముందస్తు ఆడిట్

ఆడిట్ రాష్ట్ర డైరెక్టర్ హరిప్రకాష్ రెడ్డి

ప్రజాశక్తి - ఆమదాలవలస

ఆర్థికశాఖ అనుమతితో ముందస్తు ఆడిట్ విధానాన్ని రాష్ట్రంలోని 123 మున్సిపాల్టీల్లో ఈ ఏడాది నుంచి అమలు చేస్తున్నట్లు ఆడిట్ రాష్ట్ర డైరెక్టర్ హరిప్రకాష్ రెడ్డి వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లా నుంచి ఈ విధానానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ విధానం ఇప్పటికే ప్రయోగాత్మకంగా దేవాదాయ శాఖలో అమలు చేయడంతో ఆదాయ మార్గాలు పెరిగాయన్నారు. పోస్టు ఆడిట్‌తో ఏర్పడిన ఇబ్బందుల దృష్ట్యా మున్సిపల్ కమిషనర్లు ప్రీ ఆడిట్ విధానానికి మొగ్గు చూపారని తెలిపారు. మున్సిపాల్టీల్లో ఈ విధానం సిఎఫ్ఎంఎస్ ద్వారా ఆన్‌లైన్‌లో ఉన్నట్లు చెప్పారు. పనులకు బిల్లులు చెల్లించే సమయంలో ఆడిట్ చేయడం వల్ల పారదర్శకత ఉంటుందని తెలిపారు. రూ.2,100 కోట్లకు సంబంధించి ఈ విధానంలోనే ఆడిట్ చేయడం ద్వారా 25 శాతం నిధులు ఆదా చేయగలిగామని తెలిపారు. గత సంవత్సరం 15వ ఆర్థిక సంఘం నిధులను ప్రీ ఆడిట్ చేయడం వల్ల శత శాతం ఆడిట్ చేసిన రాష్ట్రాల్లో రాష్ట్రం అగ్రగామిగా నిలిచిందన్నారు. ఈ విధానం వల్ల ఐదు రోజుల్లో పని వివరాలను పూర్తి చేయొచ్చని చెప్పారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల ద్వారా మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. ఆన్‌లైన్ చేసే సమయంలో హెల్ప్ డెస్క్‌ను అన్ని జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేశామని, వాటి ద్వారా చిన్న చిన్న సమస్యలను పరిష్కరించవచ్చని చెప్పారు. శ్రీకాకుళం, ఆమదాలవలస మున్సిపల్ ఉద్యోగులకు, ఆడిటర్లకు ఈ అంశంపై శిక్షణను ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.రవి సుధాకర్, నాగేంద్ర, అసిస్టెంట్ ఆడిటర్లు అప్పారావు, రామ్మోహనరావు, మురళీకృష్ణ, సూర్యారావు, సీనియర్ ఆడిటర్లు సుందరరావు, ప్రదీప్, రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆడిట్ రాష్ట్ర డైరెక్టర్ హరిప్రకాష్ రెడ్డి


కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

'ఉపాధి' హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని పెద్దలింగాలవలసలో గాలిదేవర చెరువులో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ మేరకు కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రెండు పూటలా పనిచేసి కనీస కూలి తీసుకోవాలని సూచించారు. పనిచేసిన ప్రదేశంలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని కూలీలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై సంబంధిత అధికారులతో మాట్లాడి మౌలిక సదుపాయాలతో పాటు, తాగునీరు, నీడ సదుపాయం కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, జెసిఎస్ ఇన్‌ఛార్జి మీసాల శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి లుకలాపు శ్రీనివాసరావు, లుకలాపు అనిల్ కుమార్, లుకలాపు సుధీర్, కలిశెట్టి భాస్కరరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాహుల్‌కుమార్‌రెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి మేజర్ పంచాయతీ ప్రజానీకం సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. టెక్కలి సచివాలయం-1లో మంగళవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలో ప్రజలకు తాగునీటి సదుపాయం, కాలువలు నిర్మాణం, విద్యుత్ దీపాలు వంటి మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలన్నారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేవిధంగా చూడాలన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో వార్డు స్పందన కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని అన్నారు. కార్యక్రమంలో టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, జెడ్‌పిటిసి దువ్వాడ వాణి, ఎంపిపి ఆట్ల సరోజినమ్మ, సర్పంచ్ గొండెల సుజాత, వార్డు సభ్యులు సువ్వారి రాజేశ్వరరావు, మండల పరిషత్ కార్యాలయం పరిపాలన అధికారి హెచ్.వెంకటరమణమూర్తి, కార్యదర్శి కూన వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్‌టిసి డిపో మేనేజర్‌గా సీతారామ నాయుడు

ప్రజాశక్తి- పలాస


సీతారామ నాయుడు

పలాస ఆర్‌టిసి డిపో మేనేజర్‌గా రోణంకి సీతారామ నాయుడు మంగళవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు డిపో మేనేజర్ పనిచేసిన శ్రీనివాసరావు పాడేరు డిపో మేనేజర్‌గా బదిలీ అయ్యారు. పాడేరులో డిపో మేనేజర్‌గా పని చేసిన సీతారామ నాయుడు ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఉద్యోగులు, యూనియన్ నాయకులు స్వాగతం పలికారు.

రైతు శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

రైతు శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల రైతులకు స్పీకర్ క్యాంప్ కార్యాలయం వద్ద యంత్ర సేవా పథకం రెండో విడత భాగంలో రైతులకు యంత్ర పరికరాలను మంగళవారం అందజేశారు. అనంతరం ట్రాక్టర్లను జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రైతులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నారన్నారు. గ్రూప్ సభ్యులు 10 శాతం చెల్లిస్తే 40 శాతం ప్రభుత్వం సబ్సిడీని 50 శాతం బ్యాంకు రుణంగా అందజేస్తుందని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కన్నా యంత్రాలు బహిరంగ మార్కెట్లో తక్కువ ధరకు దొరికితే రైతులు అక్కడే తీసుకోవచ్చునని తెలిపారు. ఒక్కో రైతు భరోసా కేంద్రానికి రూ.15 లక్షల విలువైన యంత్ర పరికరాలను అందజేస్తుందని అన్నారు. విత్తనం నుంచి విక్రయం వరకు రైతు భరోసా కేంద్రాల ద్వారానే జరుగుతున్నదని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కు ముందే ప్రభుత్వం రైతు భరోసా నిధులను ప్రభుత్వం విడుదల చేసిందని, వైఎస్ఆర్ యంత్ర సేవా పథకం కింద ఆధునిక పనిముట్లను రైతులకు అందుబాటులో ఉంచామని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, నాలుగు మండలాల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి కుళాయిలకు శంకుస్థాపన

పొందూరు: నియోజకవర్గంలోని ఇంటింటికీ తాగునీరు, ప్రతి సెంటు భూమికీ సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని తుంగపేటలో జలజీవన్ మిషన్ కార్యక్రమం ద్వారా రూ.34 లక్షలతో ఇంటింటా కుళాయి ఏర్పాటుకు మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నాలుగేళ్లలో అందజేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి కిల్లి ఉషారాణి, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, మాజీ సర్పంచ్ బొడ్డేపల్లి ప్రసాద్‌రావు, జమ్మినాయుడు పాల్గొన్నారు.


ఆమదాలవలస : జెండా ఊపి ట్రాక్టర్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్ సీతారాం

మెరుగైన వైద్యం అందించాలి

సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని మసాహెబ్‌పేటలో వైద్య సేవలు మరింత మెరుగుపర్చాలని, తాగునీటిని తనిఖీలకు పంపించాలని టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి సూచించారు. మంగళవారం 'ప్రజాశక్తి'లో గ్రామాల్లో విజృంభిస్తున్న డయేరియా వచ్చిన కథనానికి సబ్ కలెక్టర్ స్పందించారు. ఈ మేరకు మంగళవారం మాసాహెబ్‌పేటలో కొత్తపల్లి పిహెచ్‌సిని పరిశీలించి వైద్యాధికారులతో వైద్య శిబిరం నిర్వహించారు. అలాగే గ్రామంలో పారిశుద్య పనులు చేపట్టాలని ఆదేశించారు. వేడి నీటిని తాగాలని, జింక్ మాత్రలను వేసుకోవాలని సూచించారు. గ్రామంలో డయేరియాపై ఆరా తీశారు. రెండు రోజులుగా 30 మంది రోగులు డయేరియా బారిన పడ్డారని గుర్తించారు.


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న రాహుల్‌కుమార్‌రెడ్డి

కార్యక్రమంలో డిఎంహెచ్‌ఒ బొడ్డేపల్లి మీనాక్షి, డాక్టర్లు గోపీకృష్ణ, వరుణ్, తహశీల్దార్ జామి ఈశ్వరమ్మ, డిటి ఆర్.మధు, సర్పంచ్ ప్రతినిధి సంపతిరావు, హేమసుందరరాజులు ఉన్నారు. అనంతరం డిఎంహెచ్‌ఒ డయేరియా ఉన్న గ్రామాలను సందర్శించి అక్కడ వైద్య సిబ్బందిని పలు సూచనలు చేశారు.

ఎస్‌పిని కలిసిన పర్యావరణ ప్రేమికుడు


మొక్కను అందజేస్తున్న అశుతోష్ పాండే

ప్రజాశక్తి- శ్రీకాకుళం

తెలుగు ప్రజల అభిమానం, అందులోనూ జిల్లా ప్రజల అభిమానం వర్ణితారాహిత్యమని, నన్ను ఆదరించి అక్కున చేర్చుకున్నారని, దేశం, సంక్షేమానికి పాదయాత్ర చేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన అశుతోష్ పాండే అన్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి జి.ఆర్.రాధికను మంగళవారం మర్యాదపూర్వకంగా కలుసుకొని పర్యావరణ పరిరక్షణకై చేస్తున్న కార్యక్రమాలను వివరించి మొక్కను అందించారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ అసితోష్ పాండే అనే దేశభక్తుడు, పర్యావరణ ప్రేమికుడు అయోధ్య రామ మందిరం నుంచి పాదయాత్ర చేస్తూ జిల్లాకు వచ్చారని అన్నారు. దేశ ప్రజలందరూ పర్యావరణానికి తమ వంతు పాత్ర పోషించాలని, అలాగే పాండేను ఆదర్శంగా తీసుకొని అందరూ బాధ్యత వహించాలని అన్నారు. కార్యక్రమంలో స్మాల్ సర్వీస్ టూ సొసైటీ కలివరపు సూర్యప్రకాష్, న్యూస్ బ్లడ్ బ్యాంకు మేనేజర్ డాక్టర్ మణికంఠ టి.లయన్ బ్లడ్ బ్యాంకు మేనేజర్ సునీల్, జెసిఐ గ్రీన్ సిటీ మణిశర్మ, మదర్స్ లవ్ ఫౌండేషన్ సుప్రజ, జిల్ ఫౌండేషన్ సత్యసాయి, సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి పొడుగు చరణ్, మథర్స్ హెల్పింగ్ సొసైటీ పైడి ప్రదీప్, సామాజిక కార్యకర్త ఉర్లం ట్వింకిల్ పాల్గొన్నారు.

9 నుంచి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

వజ్రపుకొత్తూరు : మండలంలోని దుక్కవానిపేటలో ఈ నెల 9 నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. నీలమ్మతల్లి గ్రామ దేవత ఉత్సవాలు సందర్భంగా జిల్లాస్థాయి పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మొదటి బహుమతి రూ.20 వేలు, ద్వితీయ బహుమతి రూ.15 వేలు, మూడు, నాలుగు బహుమతులు వరుసగా రూ.10 వేలు అందజేస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన జట్లు పాల్గొవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9866545718, 9502996217 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

జెడి శ్రీధర్

ప్రజాశక్తి- బూర్జ

దుకాణాల్లో నకిలీ విత్తనాలు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ కె.శ్రీధర్ హెచ్చరించారు. మండలంలోని కురింపేటలో ఉన్న ఎరువుల దుకాణాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో మండలంలో నకిలీ ఎరువులతో పాటు మొలకెత్తని విత్తనాలను విక్రయించడంతో రైతులు తీవ్రంగా నష్టపోయిన సంఘటనలు తమ దృష్టికి వచ్చాయని అన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి ఎరువుల దుకాణదారులు నకిలీ విత్తనాలు విక్రయిస్తే సహించమని హెచ్చరించారు. ఇందు కోసం గట్టి నిఘా పెట్టామన్నారు. ఈయన వెంట ఎఇఒ వి.రాజేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు పోలరాజు, లక్ష్మీనారాయణ, అశోక్, ప్రసాద్ ఉన్నారు.


తనిఖీ చేస్తున్న జెడి శ్రీధర్

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ఆమదాలవలస : మండలంలోని దూసి రోడ్డు రైల్వేస్టేషన్ సమీపంలో విశాఖపట్నం నుంచి పలాస వెళ్తున్న గుర్తుతెలియని రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని జిఆర్‌పి హెడ్ కానిస్టేబుల్ చక్రధరరావు మంగళవారం తెలిపారు. మృతుడు వయసు సుమారు 35 ఏళ్లు ఉంటుందని, ఆరెంజ్ కలర్ టీ షర్టు వేసుకున్నాడని, చామంతి రంగు కలిగి ఉన్నాడని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

కొల్లివలసలో ఉద్రిక్తత

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని కొల్లివలసలో మంగళవారం రాత్రి ఉద్రిక్తత చోటు చేసుకుంది. ప్రేమ వ్యవహారమే ఇందుకు కారణమని తెలుస్తోంది. పోలీసులు, స్థానికులు అందజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. కొల్లివలసకు చెందిన జగ్గుపల్లి వెంకటరావు, రమణమ్మల కుమారుడు పనుకు కృష్ణారావు ఇదే గ్రామానికి వందనలు ప్రేమించుకున్నారు. ఇద్దరిదీ వేర్వేరు తరగతులకు చెందిన వారు కావడంతో వారం రోజుల క్రితం కుటుంబ సభ్యులకు చెప్పకుండా ఎటో వెళ్లిపోయారు. ఈ విషయంపై కుమార్తె తండ్రి ఆనందరావు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రోజులు గడుస్తున్నా వారు రాకపోవడంతో ఆనందరావు కుటుంబ సభ్యులు అసహనానికి గురయ్యారు. దీంతో మంగళవారం రాత్రి కృష్ణారావు ఇంటి వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులను నిలదీశారు. దీంతో కొట్లాట జరిగింది. వెంకటరావు బంధువులు పనుకు లక్ష్మీనారాయణ, శ్యామల, సాంబమూర్తి అచ్చుతారావుతో పాటు మరో నలుగురు గాయపడ్డారు. వీరిని కుటుంబ సభ్యులు పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆనందరావు, దుర్గారావు, గోవిందరావు, లక్ష్మీనారాయణ, అప్పలనాయుడు, సూరపనాయుడులు తనపై దాడి చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ అశోక్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బ్రెయిన్‌డెడ్‌తో ఉపాధ్యాయుడు మృతి


గోవిందరావు (ఫైల్)

పొందూరు : మండలంలోని బాణాం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మానాపురపు గోవిందరావు (46) బ్రెయిన్‌డెడ్‌తో మంగళవారం మృతి చెందాడు. మండలంలోని తండ్యాంకు చెందిన గోవిందరావు మూడు రోజులు క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు విశాఖపట్నంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషయమించి మృత్యువాత పడ్డాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తెలు ఉన్నారు. ఈయన మృతిపై ఎంఇఒ పి.వి.రామరాజు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, బాణాం మాజీ సర్పంచ్ పి.రవిబాబు, కె.వెంకటరమణలు తమ సంతాపాన్ని తెలిపారు.

దీక్షలో సొమ్మసిల్లిన కార్మికురాలు


సొమ్మసిల్లిన ఇంద్ర

పొందూరు: మేజర్ పంచాయ తీ పొందూరులో తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పారిశుధ్య కార్మికులు చేపడుతున్న సమ్మె మంగళవారానికి ఆరో రోజులకు చేరకుంది. ఈ సందర్భంగా దీక్షా శిబిరంలో పాల్గొన్న పారిశుధ్య కార్మికురాలు ఇంద్ర వడదెబ్బకు గురి కావడంతో సొమ్మసిల్లి పడిపోయింది. దీంతో వెంటనే తోటి కార్మికులు సమర్యలు చేసి ఆస్పత్రికి తరలించి చికిత్సను అందించారు.

చందాలు వసూలు చేస్తే ఫిర్యాదు చేయాలి

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని కింతలిలో రామాలయం నిర్మిస్తున్నామని అక్రమంగా చందాలు వసూలు చేసే వారిపై గ్రామస్తులకు సమాచారం అందించాలని, లేకుంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కింతలి సర్పంచ్ పైడి రాంప్రసాద్, ఎంపిటిసి కూటికుప్పల హనుమంతురావు తెలిపారు. ఈ మేరకు గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల గ్రామాల్లో రామాలయం నిర్మాణం పేరిట రూ.లక్షలు అక్రమంగా వసూలు చేసినట్లుగా తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ విధంగా వసూలుకు పాల్పడడం వల్ల తమ గ్రామానికి చెడ్డపేరు వస్తున్నదని, రామాలయం నిర్మాణానికి తాము ఎవరి దగ్గర నుంచీ చందాలు వసూలు చేయడం లేదని తెలిపారు. వసూలుకు పాల్పడే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసి కేసులు పెడతామని హెచ్చరించారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం నౌపడ ఫీల్డ్ అసిస్టెంట్ నీలాపు ప్రసాద్‌రెడ్డిపై కూలీలు ఉపాధి హామీ ఇసి మునేంద్రను మంగళవారం వినతిపత్రం అందజేశారు. మూడు వారాలుగా తమకు పని ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారు. దీంతో సిబ్బంది వివరాలు ఆరా తీయగా, గతంలో చెల్లించాల్సిన మూడు బిల్లులు ఇంతవరకు జమ చేయలేదని తెలిసింది. అంతేకాకుండా ఉన్న ఫలంగా జాబ్ కార్డులు తొలగించిన విషయం బయటపడింది. దీంతో నౌపడకు చెందిన కూలీలు రోకళ్ల కామమ్మ, కర్రీ లీలామోహన్, రోకళ్ల లక్ష్మి తదితరులు తమకు జాబ్ కార్డు తొలగించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జాబ్ కార్డులు మంజూరు చేసి తమకు పనులు కల్పించాలని వారు కోరారు. కాగా, ఇటీవల ఫీల్డ్ అసిస్టెంట్‌పై పలు ఆరోపణలు వచ్చినా అధికారులు తాత్సారం వహించడంపై కూలీల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.


ఫిర్యాదు చేస్తున్న కూలీలు

ఉత్సవాలతో స్నేహపూర్వక వాతావరణం

పశుసంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజు


మంత్రిని సన్మానిస్తున్న నాగేశ్వరరావు

వజ్రపుకొత్తూరు: గ్రామాల్లో నిర్వహించే ఉత్సవాలు ద్వారా ప్రజల మధ్య స్నేహపూర్వక సోదరభావం పెంపొందుతుందని మత్స్య, పశు సంవర్ధక శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని కాశీనగర్ పోలమ్మ తల్లి అమ్మవారు, నువ్వలరేవు అమ్మవారు, ఒంకలూరు కొండమహంకాళి అమ్మవారు ఉత్సవాల్లో మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాశీనగర్‌లో వైసిపి నాయకులు వంక నాగేశ్వరరావు మంత్రికి దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు పి.గురయ్యానాయుడు, పిఎసిఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశవరావు, కమిటీ అధ్యక్షుడు బడే మోహనరావు, నువ్వలరేవు కమిటీ అధ్యక్షుడు ఎర్రా, మెట్టూరు ఎంపిటిసి కొండప్ప సురేఖ, సర్పంచ్ ప్రతినిధి జోగ అప్పారావు, ఆదిబలిజ సంఘం అధ్యక్షుడు లండ శ్రీను, గుంటు వేణు పాల్గొన్నారు.

ఆసరా లేదు.. ఆదుకోండి

కిడ్నీ బాధితుని ఆవేదన

ప్రజాశక్తి- కవిటి


మల్లేశ్వరరావు

ఓవైపు కిడ్నీ మహమ్మారి అణువణువు కబలిస్తుంటే, మరోవైపు మానసిక వికలాంగుడైన కొడుకు.. వృద్ధురాలైన భార్యను చూస్తుంటే గుండె తరుక్కుపోతోందని, గత రెండు నెలలుగా తనకు వస్తున్న డయాలసిస్ పింఛను కూడా సాంకేతిక కారణాలతో రాలేదని జగతికి చెందిన లక్కోజు మల్లేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. పింఛను ఆగిపోవడంతో మంగళవారం స్థానిక సచివాలయానికి చేరుకున్న మల్లేశ్వరరావు అక్కడున్న సిబ్బందితో తన గోడు వెళ్లబోసుకున్నాడు. ప్రస్తుతం పూట గడవడం కూడా కష్టంగా ఉందని, ముఖ్యంగా మానసిక వికలాంగుడైన కొడుకు, వృద్ధురాలైన భార్యతో బతుకు భారంగా మారుతోందని కంటతడిపెట్టాడు. గత రెండు నెలలుగా వచ్చిన పింఛనుతో మందులు కొనుగోలు చేశారని, ఈ సారి పింఛనూ రాలేదని నిస్సహాయత వెళ్లబుచ్చాడు. ప్రస్తుతం చేతిలో చిల్లిగవ్వ కూడా లేదని, అధికారులు స్పందించి తన పింఛను పునరుద్ధరిస్తే మందులు కొనుక్కుంటానని చెప్పిన మల్లేశ్వరరావు తన కుటుంబ పరిస్థితి గుర్తించి దాతలు, స్వచ్ఛంద సంస్థలు ఉదారంగా ఆదుకోవాలని కోరారు.

బాల కార్మికులను పనిలో పెడితే చర్యలు

ప్రజాశక్తి- రణస్థలం

పిల్లల హక్కులకు భంగం కలిగించి బాల కార్మికులను పనిలో పెడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని శ్రీకాకుళం సర్కిల్ సహాయ కార్మిక శాఖ అధికారి ఆర్.వి.శ్రీనివాస్ హెచ్చరించారు. రణస్థలంలోని షాపుల్లో బాల కార్మికులు ఎక్కడైనా పని చేస్తున్నారనే విషయంపై పలు శాఖలతో కూడిన అధికారుల బృందం మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. రామతీర్థం కూడలి, కొండములగాం రోడ్డులోని షాపులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం పిల్లలకు మెరుగైన విద్యను అందించి అనేక విధాలుగా ఉపాధి అవకాశాలను చూపిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. 14 ఏళ్లలోపు పిల్లలను పనిలో పెడితే షాపు యజమానిపై, తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో రణస్థలం ఎఎస్ఐ ఉమామహేశ్వరరావు ఉన్నారు.


షాపును పరిశీలిస్తున్న అధికారులు


నోటీసు బోర్డును చూపిస్తున్న వెంకటరమణ

ఆక్రమణలను తొలగించాలి

కొత్తూరు : మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల లో రోడ్డు ఉన్న సర్వే నంబరు 270 నాయుడు చెరువులో ఆక్రమణలకు గురువుతున్నట్లు స్థానికులు రాత పూర్వకంగా టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. సబ్ కలెక్టర్ స్పందించి రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో డిటి బి.వెంకటరమణ ఆక్రమణదారులకు మంగళవారం నోటీసులు జారీ చేశారు. అలాగే స్థలాల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. 15 రోజుల్లో ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు.


మాట్లాడుతున్న నర్సింహులు

పోరాటాలకు యువత సిద్ధం కావాలి

ప్రజాశక్తి- నరసన్నపేట

నిరుద్యోగాన్ని పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దింపేంతవరకు పోరాటాలు కొనసాగిస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి, సిపిఐ సీనియర్ నాయకులు సనపల నరసింహులు, చాపర సుందర్‌లాల్‌లు అన్నారు. నరసన్నపేట మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో అఖిలభారత యువజన సమాఖ్య వర్క్‌షాప్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగ రేటు తీవ్ర స్థాయిలో పెరిగిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువతను వాగ్దానాలతో మోసం చేస్తున్నారు తప్ప గడచిన నాలుగేళ్లలో నిరుద్యోగ శాతం విపరీతంగా పెరిగిపోయిందని మండిపడ్డారు. ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగాలు భర్తీ చేస్తామని మాటల్లో చెప్పి అరకొర ఉద్యోగాలతో యువతను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేస్తామని ప్రకటనలు ఇస్తున్నారని, ఈ ప్రకటనను చూసి మోసపోవద్దని యువతకు హితవు పలికారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకటరావు, ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజాడ యుగంధర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చాపర వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు, ఎఐవైఎఫ్ నాయకులు సాంబశివరాజు, రాము, ఆమోస్, కృష్ణ, వాసు, వెంకటరావు పాల్గొన్నారు.

జెవికె పంపిణీలో నిర్లక్ష్యం వద్దు

ఇచ్ఛాపురం : జగనన్న విద్యా కానుకల పంపిణీలో నిర్లక్ష్యం వద్దని డిప్యూటీ డిఇఒ గార పగడాలమ్మ సిబ్బందికి సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న విద్యా కానుక స్టాక్ పాయింట్‌ను మంగళవారం పరిశీలించారు. జగనన్న విద్యా కానుకలు, నాణ్యత, సరఫరా చేస్తున్న తీరుని పరిశీలించారు. పాఠశాల తెరిచిన రోజుకే విద్యార్థులకు విద్యా కానుకలు చేరేలా చూడాలని సూచించారు. ఈమెతో పాటు ఎఇఒ కె.అప్పారావు, సమగ్ర శిక్షా అభియాన్ సిబ్బంది ఉన్నారు.


కిట్లను పరిశీలిస్తున్న పగడాలమ్మ

మండల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- రణస్థలం

మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని సిబ్బంది, సచివాలయ సిబ్బంది కృషి చేయాలని ఎంపిడిఒ ఎ.రమణమూర్తి అన్నారు. ఈయన విజయనగరం జిల్లా చీపురుపల్లి పంచాయతీరాజ్ ఎఒగా పనిచేస్తూ... ఉద్యోగోన్నతిపై బదిలీపై ఇక్కడకు వచ్చి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు మంగళవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. అనంతరం సచివాలయం మండల అధ్యక్షులు లంక గణపతి మాట్లాడుతూ సచివాలయం ఉద్యోగులు, మండలంలో ఉన్న అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని అన్నారు. ఎంపిడిఒ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు సహాయ సహకారాలతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో మండల ఎఒ బి.ధనుంజయరావు, యూనియన్ సభ్యులు సతీష్, రామునాయుడు, ఎ.శంకరరావు, లక్ష్మి, గోవిందరావు, అమ్మోజి, సిహెచ్.ఆశాలత, సుష్మస్వరాజ్, లలిత, అనిల్ వాసు, బాలకృష్ణ, రాంబాబు పాల్గొన్నారు.


సన్మానిస్తున్న సిబ్బంది

జిల్లా జడ్జిని కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు

ప్రజాశక్తి- పలాస

జిల్లా జడ్జి జూనైద్ అహ్మద్ మౌలానాను బార్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పలాస కోర్టుకు సంబంధించి పలు సమస్యలను జిల్లా జడ్జి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయన సానుకూలంగా స్పందించి పలు సూచనలు చేశారు. నూతన కమిటీ సభ్యులను అభినందించారు. జిల్లా జడ్జిని కలిసిన వారిలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎన్.విశ్వేశ్వరరావు, సెక్రటరీ పిండి వెంకటరావు, జాయింట్ సెక్రటరీ జి.ఎం.ఎస్.అనిల్‌రాజు, సభ్యులు వై.హేమకుమార్, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ ఆథారిటీ సెక్రటరీ సన్యాసినాయుడు, లోక్ అదాలత్ పర్మనెంట్ మెంబరు సువర్ణ రాజు పాల్గొన్నారు.


జిల్లా జడ్జితో బార్ అసోసియేషన్ సభ్యులు

మృత్యువులోనూ వీడని బంధం

అరగంట వ్యవధిలో గుండెపోటుతో భార్యాభర్తలు మృతి

ప్రజాశక్తి- సోంపేట

అరగంట వ్యవధిలో దంపతులు మృతి చెందిన సంఘటన సోంపేట మండలంలోని కొర్లంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత కృష్ణవేణి (58)కి ఒక్కసారిగా తీవ్రమైన గుండె నొప్పి రావడంతో గ్రామంలో ఉన్న ఆర్‌ఎంపి వైద్యుడిని పిలిపించి చూపించారు. ఆయన పరీక్షించగా... అప్పటికే మృతి చెందారు. భార్య మృతిని తట్టుకోలేని భర్త భీమారావు (72) బోరున విలపించారు. తరువాత అరగంట వ్యవధిలో భీమారావుకీ గుండెపోటు రావడంతో ఆరుబయట ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. 108 సిబ్బంది వచ్చి పరీక్షించగా... అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. భీమారావు రైల్వే డ్రైవర్‌గా పనిచేసూ... ఉద్యోగ విరమణ పొందారు. ఈయన కుమారుడు పదో తరగతి చదువుతున్న సమయంలో అనారోగ్యానికి గురై మృతి చెందాడు. తరువాత ఓ పాపను దత్తతీసుకున్నారు. ఆమో కూడా అనారోగ్యానికి గురై మృతి చెందింది. బిలాయిలోని ఓ అనాథ ఆశ్రమలోని పిల్లను దత్తతీ తీసుకున్నారు. ప్రస్తుతం ఆ పాప ఇంటర్ చదువుతుంది. ఈయన గ్రామంలోని షిర్డీ, రామాలయం ఆలయాలు బాధ్యతలు చేపట్టేవారు. దీంతో గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. వీరి మృతికి సర్పంచ్ రామ్ బుడ్డి గణపతి, పి.పట్టాభి రామారావు, కర్రి జగదీష్, తిరుమల రావు, ఆర్.శ్రీనివాసరావు, టి.వాసుదేవరావు, పి.దిల్లీరావు, ఆర్.జానకిరావు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతదేహాలను శ్మశానానికి తీసుకెళ్లి ఒకే పాడెపై పెట్టి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. వీరి అంతిమ సంస్కారాల్లో అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.


భీమారావు, కృష్ణవేణి (ఫైల్)

రాజగోపాలరావు విగ్రహ ఏర్పాటుకు చర్యలు

కోటబొమ్మాళి: మాజీ ఎంపీ బొడ్డేపల్లి రాజగోపాలరావు విగ్రహ ఏర్పాటుకు కోటబొమ్మాళిలో మండల పరిషత్ అధ్యక్షుడు రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు మంగళవారం శంకుస్థాపన చేశారు. రాజగోపాలరావు అభిమానులు ఆర్థికసాయంతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు దుక్క రామకృష్ణ, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, మండల విప్ బొడ్డు అప్పన్న, నూక సత్యరాజు, బమ్మిడి గణపతిస్వామి, పేడాడ వెంకటరావు, అన్నెపు రామారావు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఈశ్వరరావు

ఇంటింటికీ తాగునీరు

వజ్రపుకొత్తూరు: ఇంటింటికీ తాగునీరు అందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని సర్పంచ్ గూడ గిరిజ ఈశ్వరరావు అన్నారు. మండలంలోని గరుడుభద్ర పంచాయతీ పరిధిలో మర్రిపాడులో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా నిర్మిస్తున్న బోరు బావి పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. మంత్రి అప్పలరాజు సహకారంతో పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎం.పార్వతి, కె.వరలక్ష్మి, ఎం.హిమావతి,కె.నీలవేణి, జి.హైమావతి, ఆర్.కమల, ఆర్.భాస్కరరావు, ఎం.చంద్రభూషణ్, ఎం.దాలయ్య, కె.విప్లవకుమార్, ఆర్.సంతోష్, ఆర్.తాతారావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

సకాలంలో సరుకులు అందజేయాలి

కోటబొమ్మాళి : ప్రభుత్వం అందజేస్తున్న రేషన్ సరుకులను వినియోగదారులకు సకాలంలో అందజేయాలని జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటరావు అన్నారు. మండలంలోని చీపుర్లపాడు ఎండియు వాహనం ద్వారా పంపిణీ చేస్తున్న వాహనాన్ని మంగళవారం పరిశీలించారు. రోజూ సరుకులు పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని, నెట్ వర్క్ సమస్య వల్ల సకాలంలో అందజేయలేకపోతున్నామని ఎంపిడిఎ సనపల వెంకటరమణ తెలియజేశారు. దీంతో డిఎస్‌ఒ యంత్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కె.రాము, విఆర్‌ఒ జబినా పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న తహశీల్దార్ సరోజిని

తహశీల్దార్ స్థల పరిశీలన

మెళియాపుట్టి : మండలంలో పెద్దపద్మాపురంలో సర్వే నంబరు 291/1లో 8 సెంట్లు ప్రభుత్వ స్థలాన్ని తహశీల్దార్ సరోజిని, ఎస్‌ఐ టి.రాజేష్ మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురవుతుందని గ్రామస్తులు ఇటీవల తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో కార్యదర్శి సిహెచ్.అప్పారావు, ఎంపిటిసి ప్రధినిధి యు.రుషి, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఆర్‌అండ్‌బి స్థలాల సర్వే

పొందూరు: మండలంలోని కొంచాడ వద్ద ఉన్న ఆర్‌అండ్‌బి, పిడబ్ల్యుఎస్ స్థలాల ఆక్రమణలను మండల సర్వే అధికారులు మంగళవారం సర్వే చేశారు. గ్రామం పరిధిలోని 49, 50 సర్వే నంబర్లలో కొంతమంది విలువైన స్థలాలను ఆక్రమించినట్లు సర్పంచ్ పెయ్యిల అనురాధ కలెక్టర్ స్పందనలో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరు ఆక్రమణలను సర్వే చేపట్టారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ పాత్రో, కార్యదర్శి ఎస్.రమేష్, అసిస్టెంట్ సర్వేయర్ ప్రసాద్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న విజ్ఞాన శిబిరాలు


దేశ నాయకుల వేషధారణలో విద్యార్థులు

ప్రజాశక్తి- లావేరు

చదరంగం అంతర్జాతీయ ఆట అని, విద్యార్థి దశ నుంచే ఈ ఆటను ఆడుకోవాలని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మురపాక శాఖాగ్రంథాలయంలో విద్యార్థులకు చదరంగం పోటీలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించాయని మాట్లాడుతూ ఈ ఆటలో బంట్లు, గుఱ్ఱము, ఏనుగు, శకటం, మంత్రి, రాజు ఉంటారని, మనసుకు పదును పెట్టి ఈ చదరంగం ఆటను ఆడాలని అన్నారు. ఈ ఆటలో గెలుపొందిన విజేతలకు ప్రథమ ద్వితీయ, తృతీయ బహుమతులను ఈ నెల 11న అందచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు పి.షణ్ముఖరావు పాల్గొన్నారు.

బలగ : నగరంలోని బలగ గ్రంథాలయంలో పిల్లలు స్వాతంత్ర సమరయోధుల వేషధారణలో అలరించారు ఈ కార్యక్రమానికి అతిథిగా తెలుగు ఉపాధ్యాయులు, కవి భోగేల ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ చిన్ననాటి నుంచి ప్రతి విద్యార్థీ దేశంపై ప్రేమతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్వాతంత్ర సమరయోధులు వేషధారణలో నెహ్రూ, భగత్ సింగ్, టంగుటూరి ప్రకాశం పంతులు, అంబేద్కర్, భరతమాత వేషధారణలో విద్యార్థులు అలరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేను, సహాయకులు కె.అనిత పాల్గొన్నారు.

సేవల్లో ఘనాపాటి 'మాతృమూర్తి'

ప్రజాశక్తి- కవిటి

ఆర్తులకు, అన్నార్తులకు అండగా నిలుస్తూ, ఆపద అంటే సరే పద అంటూ మండలంలోనే కాక జిల్లా వ్యాప్తంగా మాతృమూర్తి యువజన సంఘం అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ రజనీకుమార్ దొలై ప్రశంసించారు. మండలంలోని కుసుంపురం కేంద్రంగా పనిచేస్తున్న మాతృమూర్తి యువజన సేవా సంఘం 14వ వార్షికోత్సవం వేడుకలు బల్లిపుట్టుగ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మాతృమూర్తి యువజన సంఘం సేవలు మరువలేనివని, సమాజ సేవలో యువత కీలకపాత్ర పోషించాలని ఆకాంక్షించారు. అనంతరం కుసుంపురానికి చెందిన పది మంది మహిళలు, ఆడపడుచులను ఘనంగా సన్మానించి, రెండు నిరుపేద కుటుంబాలకు నెలకు సరిపడే నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో కుసుంపురం సర్పంచ్ ఊర్మిళ శివ బిసాయి, సమాజ సేవకులు అనింగి మాధవరావు, ఉపాధ్యాయులు ఢిల్లీ బిసాయి, ఎస్.శారద, రఘు పాణిగ్రాహి, ఎంపిటిసి కర్రి పద్మావతి, సత్యం పాల్గొన్నారు.


మహిళలను సన్మానిస్తున్న మాతృమూర్తి సభ్యులు

ప్రతిభావంతులకు సన్మానం


విద్యార్థినిని సన్మానిస్తున్న మధుబాబు

పలాస : ఇటీవల ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ప్రభుత్వ జూనియర్ కళాశాల చరిత్ర గ్రూపు ప్రతిభావనులకు మధురచరితం ఆధ్వర్యాన మంగళవారం సన్మానించారు. విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రుల సమక్షంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. 925/1000 మార్కులతో జిల్లా టాపర్‌గా చరిత్ర సృష్టించిన ఇప్పిలి చామంతి సముచిత సత్కారాన్ని అందుకుంది. జగనన్న ఆణిముత్యాలు పురస్కారానికీ అర్హత పొందిన ఈ విద్యార్థిని స్వస్థలం మెళియాపుట్టి మండలం జోడూరు. పలాసలో బంధువుల ఇంట్లో ఉంటూ చదువుకుంది. కాగా, కళాశాల చరిత్ర అధ్యాపకుడు కొండల మధుబాబు మన చరిత్ర-సంస్కృతి పరిరక్షణ కోసం 13 వసంతాలు కిందట మధురచరితానికి రూపు ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బాడ వెంకట మోహన్, పిఇటి సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి.తవిటయ్య, చామంతి తల్లిదండ్రులు సంజీవరావు, పూర్ణ పాల్గొన్నారు. అలాగే ఇటీవల డాలసరిలో చరిత్ర విద్యార్థులు సవర రాజేశ్వరి 895/1000, డబారిసింగిలో మజ్జి రాజు హిస్టరీ 98/100 మార్కులు సాధించిన విద్యార్థులకూ వారి స్వస్థలాలలో జ్ఞాపికలతో అభినందించారు.

అర్హులకు సంక్షేమ పథకాలు

లావేరు : మండలంలోని భరణికాంలో మంగళవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను అందజేశారు. ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతినిధి లంకలపల్లి ప్రసాద్, ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, వైసిపి మండల అధ్యక్షులు దన్నాన రాజినాయుడు పాల్గొన్నారు.

టెక్కలి : అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తుందని నియోజకవర్గ ఇన్‌ఛార్జి, జెడ్‌పిటిసి దువ్వాడ వాణి అన్నారు. మండలంలోని అయోధ్యాపురంలో గడపగడపు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడారు. ఎంపిపి ఆట్ల సరోజనమ్మ, సర్పంచ్ బగాది హరి, గుజ్జు మోహన్‌రెడ్డి, రౌతు జయమోహన్, కె.కామేశ్వరరావు, ఆట్ల రవి, గండి అప్పలరెడ్డి పాల్గొన్నారు.

చెరువుగర్భంలో జగనన్న ఇళ్లా!

ప్రజాశక్తి- పలాస

రాష్ట్ర పభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న కాలనీ పేరుతో చెరువు గర్భం, కోర్టు కేసులో ఉన్న భూముల్లో నిర్మించడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని నియోజకవర్గం జనసేన నాయకులు కె.దుర్గారావు అన్నారు. మండలంలోని గరుడఖండి పంచాయతీలో చెరువు గర్భంలో పేదలకు కేటాయించిన జగనన్న కాలనీ ఇళ్ల స్థలాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నివాసయోగ్యం కాని ప్రదేశంలో ఇళ్ల స్థలాలు కేటాయించడం చాలా దారుణమన్నారు. పేదలపై ఇంత నిర్లక్ష్యం తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లవుతున్నా... అక్కడ కనీసం ఐదు శాతం ఇళ్లు కూడా పూర్తి కాలేదన్నారు. పేదలను మోసగించడమే తప్ప, మేలు చేసే ఉద్దేశం ప్రభుత్వానికి లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.1.80 లక్షలు తప్ప రాష్ట్ర ప్రభుత్వం ఒక రూపాయీ ఇవ్వడం లేదన్నారు. ప్రచారాలు చేసుకోవడం తప్ప అభివృద్ధి శూన్యమన్నారు.


పరిశీలిస్తున్న దుర్గారావు


మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ శాంతి

ఆర్‌డిఒ పరిశీలన

ప్రజాశక్తి- జలుమూరు

మండలంలోని చిన్నదూగాం పంచాయతీ పరిధి సర్వే నంబర్లు 48, 59 ఉన్న కాకర్లవాణి చెరువును ఆర్‌డిఒ బొడ్డేపల్లి శాంతి మంగళవారం పరిశీలించారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు కాకర్లవాని చెరువులో ఉన్న ఇళ్ళు, ఇతర కట్టడాలు, ఆక్రమణలలో ఉన్న వాటిని తొలగించేందుకు గల అవకాశాలను రెవెన్యూ, విద్యుత్, ఇరిగేషన్, పంచాయతీ, సర్వే అధికారులతో సంయుక్తంగా పరిశీలించారు. చెరువును పూర్వ స్థితికి తీసుకువచ్చేందుకు సాధ్యసాధ్యాలనూ పరిశీలించినట్లు చెప్పారు. ఈ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని అన్నారు. ఈమెతో పాటు ఎస్‌ఇ పొన్నాడ సుధాకర్, డిపిఒ పి.రవికుమార్, తహశీల్దార్ బి.సత్యం, సర్వేయర్ తర్ర నాగేశ్వరరావు, విద్యుత్‌శాఖ ఎఇ వారణాసి వెంకటేశ్వరరావు ఉన్నారు.

రక్షణ గోడ నిర్మాణానికి శంకుస్థాపన

సోంపేట: మండలంలోని పలాసపురం పంచాయతీ లక్కవరంలో ఉన్న పాత చెరువులో రక్షణ గోడ నిర్మాణానికి జెడ్‌పిటిసి తడక యశోద, సోంపేట మండల వైసిపి అధ్యక్షులు, పలాసపురం సర్పంచ్ తడక జోగారావు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పనకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఎంపిటిసి పోలాకి రమణమూర్తి, పంచాయతీరాజ్ ఇంజినీర్ ధనుంజయరావు, సనపల శ్రీరామ్మూర్తి, పిరియా కృష్ణారావు, దున్న మోహనరావు పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు

విద్యార్థులే వ్యవస్థాపకులు

కోటబొమ్మాళి: శ్రీకాకుళం రూరల్ మండలం నైర వ్యవసాయ కళాశాలలో ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులే వ్యవస్థాపకులుగా సూర్య వెర్మిటెక్నాలజీ యూనిట్‌ను నడిపిస్తున్నారని కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీలత, డాక్టర్ పి.గురుమూర్తిలు అన్నారు. నైర కళాశాల విద్యార్థులు తయారు చేస్తున్న వెర్మిటెక్నాలజీని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ కోర్సులో భాగంగా విద్యార్థులు వర్మీకంపోస్టు, వర్మీవాష్, వర్మీ హేచరీని తయారు చేస్తున్నారని అన్నారు. ఈ యూనిట్‌లోని మొత్తం 13 విద్యార్థులు వ్యర్థ పదార్థాలను ఉపయోగించి వర్మీకంపోస్టు తయారు చేస్తున్నారని అన్నారు. దాని ప్రయోజనాలను రైతులకు వివరిస్తూ... సంద్రీయ సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. అలాగే తయారు చేసిన వర్మీకంపోస్టును పొలాలకు, పళ్ల తోటకు, నర్సరీలకు ఎగుమతి చేస్తున్నారని తెలిపారు.

ఆర్థిక మోసాలపై అవగాహన అవసరం

ఆమదాలవలస : ఆర్థిక మోసాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆర్థిక అక్షరాస్యత సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) అన్నారు. పురపాలక సంఘ పరిధిలోని 15వ వార్డు పాతినవారివీధిలో ఆర్‌బిఐ పథకంలో భాగంగా యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో భాగంగా ఆర్థిక అక్షరాస్యత మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామంటూ ఎవరైనా ఫోన్లు చేసి మీ బ్యాంకు అకౌంటు వివరాలను అడిగితే సమాచారాన్ని ఇవ్వవద్దని సూచించారు.